www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 3 డిసెంబర్ 2025
5
పశ్చిమ గోదావరి



తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలని నిరసన

ప్రజాశక్తి - పెంటపాడు

దిత్వా తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ స్థానిక గాంధీబొమ్మ సెంటర్లో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా నాయకులు చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు సిరపరపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో వచ్చిన మొంథా తుపాన్ వల్ల వరి, ఇతర పంటలు దెబ్బతిన్నాయని, ఇప్పుడు దిత్వా తుపాన్ వల్ల చేతికొచ్చిన పంట అమ్ముకునే అవకాశం లేక 75 కేజీల బస్తానే దళారులకు రూ.500 తగ్గించి అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 17 శాతం తేమ నిబంధన సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కరక వెంకట్రావు, గంట కోటి, పెనగంటి దుర్గా, బల్ల బాలాజీ, దత్తు రాము, మాదాసు శ్రీను, పూడి బాలాజీ, మాదాసు రాజు, అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

ఇల్లు.. కట్టండయ్యా..!

- కూటమి ప్రభుత్వంలో ఒక్క ఇల్లూ మంజూరు కాని దుస్థితి
- ఇటీవలే దరఖాస్తులు స్వీకరిస్తున్న గృహనిర్మాణశాఖ
- ఏలూరు జిల్లాలో 48,407, పశ్చిమలో 14,230 దరఖాస్తులు
- 14వ తేదీ వరకూ దరఖాస్తుల గడువు పొడిగింపు
- కొత్త ఇళ్లకు అనుమతి ఎప్పటికిస్తారోననే అనుమానాలు
- 2014-19లో ఇళ్ల నిర్మాణ బకాయిలు రూ.80 కోట్లు పెండింగ్‌లోనే



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొత్త ఇళ్ల నిర్మాణం కోసం జనం గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి రెండు జిల్లాల్లో పెద్దసంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. నవంబర్ 30వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ గడువు విధించడంతో అంతా ఉరుకులు పరుగులు పెట్టారు. చాలామంది దరఖాస్తు చేసుకోకుండానే గడువు ముగిసింది. దీంతో ఈ నెల 14వ తేదీ వరకూ గడువు పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ కొత్త ఇళ్ల నిర్మాణం గురించి పట్టించుకోలేదు. దీంతో ఎంఎల్ఎల నుంచి సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ఇటీవల ఏలూరులో జరిగిన డిఆర్‌సి సమావేశంలో కొత్త ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఎంఎల్ఎలంతా గళమెత్తారు. ఏలూరు జిల్లాలో మొత్తం 48,407 దరఖాస్తులు రాగా, పశ్చిమలో 14,230 దరఖాస్తులు వచ్చాయి. రెండు జిల్లాల్లో ఇప్పటి వరకూ 62,637 మంది కొత్త ఇంటి నిర్మాణానికి రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దరఖాస్తులు స్వీకరించినా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే అనుమతిస్తుందా.. లేక తాత్సారం చేస్తుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. గత వైసిపి ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణమే ప్రస్తుతం సాగుతోంది. ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు చొప్పన ఇస్తున్నారు. కొత్తగా మంజూరు చేసే ఇళ్లకు ఎంత సాయం అందిస్తారో ఇప్పటి వరకూ తెలని పరిస్థితి ఉంది.

కూటమి వచ్చాక కట్టుకున్న ఇళ్లకు సాయం అందిస్తారా?

కూటమి ప్రభుత్వం రావడంతో కొత్త ఇంటి నిర్మాణానికి అవకాశం ఇస్తుందని అంతా ఆశించారు. ఇల్లు కట్టుకునే వారంతా ప్రజాప్రతినిధుల వద్దకు క్యూకట్టారు. దీంతో ఇంటిని నిర్మించుకోండి, ఎప్పుడు ఆన్‌లైన్ చేసినా మీకు ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని ఎంఎల్ఎలు హామీ ఇచ్చారు. దీంతో చాలామంది అప్పు చేసి ఇళ్ల నిర్మాణం చేశారు. అటువంటి వారు కూడా ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నారు. వారికి ప్రభుత్వ సాయం అందిస్తుందా.. లేదా హ్యాండిస్తుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఇటీవల ఏలూరులో జరిగిన డిఆర్‌సి సమావేశంలోనూ ఇదే అంశంపై చర్చ సాగింది. దీనిపై సిఎంతో మాట్లాడతామని గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ప్రజాప్రతినిధులు ఇచ్చిన మాటతో ఇల్లు కట్టుకున్న వారికి న్యాయం జరగకపోతే ప్రభుత్వంపై వ్యతిరేకత పెల్లుబికే పరిస్థితి ఉంది.

2014-19లో బకాయిలు ఇచ్చేదెప్పుడు..?

అధికారంలోకి వచ్చిన వెంటనే 2014-19 మధ్య ఇళ్లు నిర్మించుకుని సాయం అందని లబ్ధిదారులందరికీ బకాయి సొమ్ము అందిస్తామని ఎన్నికల్లో సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఇప్పటి వరకూ చిల్లిగవ్వ ఇవ్వలేదు. అప్పటి టిడిపి ప్రభుత్వంలో నిర్మాణం జరిగిన ఇళ్లకు తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం బకాయిలు ఇవ్వకుండా ఎగనామం పెట్టింది. వైసిపిపై తీవ్ర వ్యతిరేకత రావడానికి ప్రధాన కారణాల్లో ఇది ఒకటి. అప్పట్లో ఇల్లు కట్టుకుని సొమ్ము అందని లబ్ధిదారులు ఏలూరు జిల్లాలో 26,815 మంది ఉండగా రూ.40.96 కోట్లు వరకూ బకాయి ఉంది. పశ్చిమలో 12,395 మంది ఉండగా రూ.40.50 కోట్లు వరకూ పెండింగ్ బకాయిలు ఉన్నాయి. ఈ సొమ్ము ఎప్పటికిస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఎంఎల్ఎలు జిల్లా సమీక్షా సమావేశాల్లో ప్రశ్నిస్తున్నా ప్రభుత్వం నుంచి మాత్రం సరైన స్పందన లేకుండా పోయింది. ప్రభుత్వం వెంటనే ఇళ్ల నిర్మాణ పాత బకాయిలు అందించాలని అంతా కోరుతున్నారు.



మొగల్లులో ధాన్యం పడుతున్న రైతులు

రైతుల ఆశలపై దిత్వా నీళ్లు

- తుపాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు
- పంట చేతికందే సమయంలో రైతులు ఉరుకులు పరుగులు
- ధాన్యం కొనుగోలులో నిలువు దోపిడీ
- తేమ శాతంతో పేరుతో ముప్పతిప్పలు

ప్రజాశక్తి - భీమవరం

గంపెడాశతో మరికొద్ది రోజుల్లో వరి పంట చేతికి అందుతుందనుకున్న రైతన్న ఆశలపై దిత్వా తుపాన్ నీళ్లు చల్లింది. సాగు ప్రారంభం నుంచి అష్టకష్టాలు ఎదుర్కొని పంట చేజిక్కించుకుంటున్న సమయంలో చేతికందకుండా చేజారి పోతుందనే ఆందోళన రైతులను వేధిస్తోంది. తుపాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మంగళవారం వర్షం కురిసింది. రెండు రోజుల నుంచి జిల్లాలో ఆకాశం మేఘావృతమై కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. అయితే మంగళవారం ఉదయం నుంచి వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. దీని ప్రభావంతో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది.



వేండ్రలో ధాన్యానికి బరకం కప్పిన దృశ్యం

ఈ ఏడాది ఖరీఫ్‌లో వరస అల్పపీడనాలు, తుపాన్లు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గత నెలలో మొంథా తుపాను విజృంభించింది. ఈదురు గాలులు, భారీ వర్షం ధాటికి జిల్లాలో 70 వేల ఎకరాల్లో వరిచేలు నేలనంటాయి. తాజాగా దిత్వా తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో రైతులకు మళ్లీ కష్టాలు ప్రారంభమయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరి చేలలో వర్షాల వల్ల ఏర్పడిన బురద తగ్గకపోవడం, చేలు ఆరకపోవడంతో వరికోతల సమయంలో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. చేలలో చెమ్మ ఉండటంతో వరి కోత యంత్రాలు దిగబడిపోయి వరి కోతకు రెట్టింపు సమయం పట్టడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లాలో 2.11 లక్షల ఎకరాలలో సాగు చేశారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 91 వేల ఎకరాల్లో మాత్రమే వరి కోతలు పూర్తయ్యాయి. ఇంకా 1.20 లక్షల ఎకరాల్లో వరికోతలు పూర్తి కావాల్సి ఉంది. దిత్వా తుపాను కారణంగా జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం నుంచి కురుస్తున్న చిరుజల్లులతో ఎక్కడికక్కడ వరి కోతలు నిలిచిపోయాయి. వరి చేలు వర్షానికి తడిసిపోవడంతో యంత్రాలతో వరి కోతలు కోసే వీలు ఉండదు. ఇప్పటికే ఆలస్యమైన వరి కోతలు ఈ వర్షాల కారణంగా మరో మూడు, నాలుగు రోజులు ఆలస్యమైతే మరింత నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కోతలు నిలిచే ఇతర ప్రాంతాల నుంచి రాష్ట్రాల నుంచి వచ్చిన వరి కోత యంత్రాలు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యంలో తేమశాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ధాన్యాన్ని సమీపంలోని కల్లాల్లో, గట్లపైనా, రోడ్లపైనా ఆరబెడుతున్నారు. ఈ క్రమంలో కురుస్తున్న వర్షం కురుస్తుండటంతో ధాన్యాన్ని ఆరబెట్టే అవకాశం లేదు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ధాన్యంలో తేమశాతం 20 శాతానికి పైగా ఉంటోంది. ప్రభుత్వం 17 శాతమే ఉండాలని నిబంధన విధించింది. దీంతో ధాన్యాన్ని కనీసం నాలుగు రోజులైనా ఆరుబయట ఆరబెట్టాల్సి ఉంటుంది.

జిల్లాలో ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యమవ్వగా, ఇప్పటివరకు సుమారు 1.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు సుమారు రూ.300 కోట్ల నగదును ఆయా రైతుల ఖాతాలకు జమ చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

పెంచలయ్య హత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్



పెనుగొండలో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - పెనుగొండ

రాష్ట్రంలో గంజాయిని అరికడతామని, నేరస్తులను ఉక్కుపాదంతో అణిచివేస్తామని ప్రభుత్వం, హోం శాఖ, పోలీసులు చెబుతున్నా ఆచరణలో గంజాయి మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. దానికి పరాకాష్ట నెల్లూరులో ప్రజా కళాకారుడు, సిపిఎం కార్యకర్త కె.పెంచలయ్య హత్యేనని అన్నారు. మంగళవారం స్థానిక కాలేజీ సెంటర్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెంచలయ్య కళాకారుడిగా చైతన్యపరుస్తూ, గంజాయికి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తున్నారని, దీన్ని సహించలేని పెంచలయ్యను వెంటాడి వేటాడి అత్యంత దారుణంగా కన్న బిడ్డల ముందే నరికి చంపడం దారుణమన్నారు. పెంచలయ్య హంతకులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో గంజాయి మాఫియాను అరికట్టడంలో, అంతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. పెంచలయ్య కుటుంబానికి కనీసం రూ.50 లక్షల ఆర్థిక సహాయం, ఆయ ఎకరాల భూమి, ఒక ఇల్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, నేతలు ఎస్.వెంకటేశ్వరరావు, కె.క్రాంతిబాబు, అంజనేయులు, శీలం ఎస తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు: అల్లరి మూకలకు వ్యతిరేకంగా, గంజాయి అమ్మకాలను అడ్డుకుంటున్న సిపిఎం కార్యకర్త పెంచలయ్య హత్యను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక దొరగారు చెరువు వద్ద జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. పెంచలయ్యను హత్య చేసిన గుండాలను కఠినంగా శిక్షించాలని, పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఆకివీడు ఏరియా కార్యదర్శి కె.తవిటినాయుడు, సీనియర్ నాయకులు ఎన్.కె.వలీ మాట్లాడారు. కార్యక్రమాల్లో నాయకులు ఎస్.ఉదయకుమారి, డి.రవితేజ, బి.వి.వర్మ



వీరవాసరంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ఎస్.సూరిబాబు, జివి.లావణ్య, సిహెచ్.పాపారావు, కె.గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం: గంజాయి ముఠాలను అరికట్టి రాష్ట్ర ప్రజలను రక్షించాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం వీరవాసరం సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో గంజాయిని అరికట్టాలని, సిపిఎం కార్యకర్త పెంచలయ్యను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు బి.అలమహోరాజు, బాలం విజయకుమార్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయిని అరికడుతున్నామని పాలకులు చెబుతున్న మాటలకు, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు సంబంధం లేదని అన్నారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పానీయాలు రాజ్యమేలుతున్నాయని, వీటిని అరికట్టలేని స్థితిలో పాలకులు



ఆకివీడులో..

నెట్టబడ్డారని అర్థమవుతుందని అన్నారు. నెల్లూరు పట్టణంలో జరిగిన ఘటన వాస్తవ పరిస్థితులకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని గంజాయి ముఠాలను ఉక్కుపాదంతో అణిచివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.ఆంజనేయులు, సుబ్బారావు, సూర్యచంద్రరావు, రాము నారాయణమూర్తి, లింగం సత్యనారాయణ, కడలి సత్యనారాయణ, బొక్కా కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పోడూరు: గంజాయి, మత్తుమందులను అడ్డుకుని ప్రజలకు అండగా నిలిచిన సిపిఎం కార్యకర్త పెంచలయ్యను చంపిన వారిని, ప్రోత్సహించిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పోడూరు కొత్తపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ గంజాయి ముఠాలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. హత్యపై హోం మంత్రి అనిత కనీసం స్పందించలేదని విమర్శించారు. ఇప్పటికైనా బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు కె.వెంకటేశ్వర్లు, పిల్లి ప్రసాద్, బి.వెంకట్రావు, బి.శ్రీనుతోపాటు స్థానిక యువకులు ఎం.ఉదయ్, డి.బాలు, డి.సంతోష్, డి.ఈశ్వర్, డి.వంశీ, టి.దివాకుమార్, ఆర్.శశికుమార్, ఎ.వెంకటేష్, డి.శ్రావణ్, వి.లక్ష్మణరావు, ఎ.పెద్దిరాజు, వి.శ్రీను పాల్గొన్నారు.

5న మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్

పండగ వాతావరణంలో నిర్వహణ - కలెక్టర్ చదలవాడ నాగరాణి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఈ నెల ఐదో తేదీన అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. తల్లిదండ్రులు నూరుశాతం హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న విద్యాసామగ్రి, బోధనా పరికరాలు, ఇతర సదుపాయాలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ నిర్వహణపై ఆమె విద్యాశాఖాధికారులతో సమీక్షించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, స్కూల్ బ్యాగ్స్, షూస్ వంటి సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు వివరించాలన్నారు. పాఠశాలల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లైబ్రరీ, ల్యాబ్, ఇతర బోధనా పరికరాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం గల ఉపాధ్యాయులతో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్న విషయం తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈ మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌ను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేరెంట్స్, టీచర్స్ మీట్‌కు పెద్దసంఖ్యలో తల్లిదండ్రులు హాజరయ్యే విధంగా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ ఇ.నారాయణ, ఎస్ఎస్ఎ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యామసుందర్, డివిజన్, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

టెస్ట్ పేపర్లను సద్వినియోగం చేసుకోవాలి : ఎంఎల్‌సి

ప్రజాశక్తి - నరసాపురం

పదో తరగతి విద్యార్థులు టెస్ట్ పేపర్లను సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి అన్నారు. నరసాపురంలోని గౌతమి విద్యాసంస్థల అధినేత చినమిల్లి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ ముద్రించిన టెన్త్ టెస్ట్ పేపర్ల పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఈ పేపర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 20 సంవత్సరాలుగా యుటిఎఫ్ టెస్ట్ పేపర్లకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. గౌతమి విద్యాసంస్థల అధినేత చినమిల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నరసాపురం నియోజకవర్గంలోని హైస్కూల్లలో ఉన్న పదో తరగతి విద్యార్థులందరికీ తమ సంస్థ ద్వారా ఉచితంగా ప్రతి సంవత్సరం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా కార్యదర్శులు పి.కృష్ణకుమారి, కె.బ్రహ్మయ్య, నరసాపురం, మొగల్తూరు మండలాల సీనియర్ నాయకులు ఎం.మార్కండేయులు, ఎంఎస్ఆర్‌కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



టెస్ట్ పేపర్స్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

జిల్లాలో పలు చోట్ల వర్షం

ప్రజాశక్తి - మొగల్తూరు

బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాన్ ప్రభావంతో మండలంలోని గ్రామాల్లో రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ తేలికపాటి వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వృత్తిగత పనుల నిమిత్తం బయటకు వచ్చేవారు కూడా మార్కెట్‌కు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఉదయం నుండి ఆకాశం మబ్బులుగా ఉన్నప్పటికీ వర్షం కురవక పోవడంతో రైతులు తమ ధ్యాన్యాన్ని ట్రాక్టర్లతో మిల్లులకు తరలిస్తున్నారు. మధ్యాహ్నం వర్షం పడటంతో ధాన్యం తడవకుండా బరకాలు కప్పి భద్రపరుస్తున్నారు. ఇంకా వాతావరణం ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏటా ప్రకృతి వైపరీత్యాలు రైతులను ముంచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాలకొల్లు : తుపాన్ ప్రభావంతో పాలకొల్లులో మంగళవారం ఉదయం నుంచి తేలికపాటి వర్షం పడుతోంది. అప్పుడప్పుడు వర్షం జోరు పెరుగుతూ ప్రజా జీవనానికి ఆటంకం ఏర్పడింది. దీనికితోడు చలిగాలులు బలంగా వీస్తున్నాయి. రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు. రూరల్ ప్రాంతంలో రైతులు వాతావరణ మార్పులకు ఆందోళన చెందుతున్నారు.

గణపవరం: వాయుగుండం ప్రభావం వల్ల గత రెండు రోజులుగా చలిగాలులతో ప్రజలు

పెనుమంట్ర : ఉదయం వేళ ఆకాశం మబ్బులు పట్టినా వర్షం రాదనుకొని రోడ్డు మీద ధాన్యం ఆరబెట్టుకున్నారు. మధ్యాహ్నం తుంపరగా ప్రారంభమై భారీగా వర్షం పడింది. దీంతో రైతులు ధాన్యం ఒబ్బిడి చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల చిన్నగా తడిసిపోతుండంతో ఆందోళన చెందారు. అలాగే ఉదయం పలువుల్లో వరి కంకుల్ని కోయడానికి చేలల్లో దిగిన కోత మిషన్లు వర్షం ఎక్కువ కావడంతో ఎక్కడ కక్కడ పనుల్ని నిలిపి వేసి, కార్మికులు, రైతులు వెళ్లిపోయారు.

నాగేశ్వరరావు కుటుంబానికి సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి - యలమంచిలి

చించినాడ పోరాట నేత, సిపిఎం నేత కేతా నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, మండల కార్యదర్శి కానేటి బాలరాజు తదితరులు నాగేశ్వరరావు కుమారుడు, సిఐటియు మండల నేత కేతా వాసు, నాగేశ్వరరావు సోదరుడు, సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావును పరామర్శించారు. నాగేశ్వరరావు చిత్రంతో కూడిన ఫ్లెక్సీ వద్ద నివాళులర్పించారు. వారి వెంట స్థానిక సిపిఎం నాయకులు తెన్నేటి స్టాలిన్, పళ్లేరు వెంకటస్వామి, డివైఎఫ్ఐ నాయకులు ఆకుమర్తి జోసెఫ్‌రాజు, తెన్నేటి జయరాజు, రాపాక చంటి తదితరులు ఉన్నారు.



కేతా నాగేశ్వరరావు ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

కాలుష్య నియంత్రణతోనే పర్యావరణ సమతుల్యత

ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేసినప్పుడే మానవ మనుగడ, వాతావరణ సమతుల్యాన్ని కాపాడొచ్చునని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు అన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఉన్నత భారత్ అభియాన్ (యుబిఎ) సెల్ ఆధ్వర్యంలో చినఅమిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల్లో చైతన్యం నింపేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల యుబిఎ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగపతిరాజు, డాక్టర్ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ కాలుష్యం బాగా పెరిగిపోవడంతో వాతావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. వర్షాకాలమంతా వర్షం కురవకుండా ఒక్కసారిగా పెద్దఎత్తున కురవడం, కురవకూడని సమయంలో వర్షాలు కురవడం వంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. దీన్ని ప్రతిఒక్కరూ గమనించి మొక్కలు నాటి ప్లాస్టిక్ నిషేధించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.అనూరాధ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుండే పాఠశాలలకు వచ్చేటప్పుడు ప్లాస్టిక్ బాటిళ్లను, ప్లాస్టిక్ కవర్లను వాడకుండా స్టీల్ బాటిల్స్ వాడుతూ మంచినీళ్లు తాగాలన్నారు. చెత్తను మంచినీటి కాలువల్లో వేయకూడదని ఆమె సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చింతపల్లి ప్రసాద్, వెట్ సెంటర్ ప్రొఫెసర్లు డాక్టర్ గణేష్, టి.సూరిబాబు, జీవన్‌కుమార్, డాక్టర్ ఆర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు పర్యావరణాన్ని కాపాడండి, చెట్లు నాటండి అంటూ భారీ ప్రదర్శన నిర్వహించారు.

గోదావరి కొబ్బరి బొండాలకు కామన్ ఫెసిలిటీ సెంటర్లు

రూ.2.24 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో కొబ్బరి రైతులు, అనుబంధ పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊతమిచ్చింది. కొబ్బరి క్లస్టర్ పరిధిలో కామన్ ఫెసిలిటీ సెంటర్ (సిఎఫ్‌సి) ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ అత్యాధునిక కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు అయ్యే మొత్తం ఖర్చు అంచనా రూ.29.97 కోట్లు. ఈ ప్రాజెక్ట్‌లో రాష్ట్ర వాటా రూ.4.49 కోట్లలో తొలి విడతగా సగం నిధులు అంటే రూ.2.24 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రతిష్టాత్మక కేంద్రాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్నాయి. కొబ్బరి ఆధారిత ఉత్పత్తుల తయారీని పెంచేందుకు, వాటికి అంతర్జాతీయ ప్రమాణాలను సాధించేందుకు ఈ కేంద్రం దోహదపడుతుంది. ఈ ప్రతిపాదనకు సంబంధించి పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా అధికారులు తెలిపారు.

భీమవరం ఇక ట్రాఫిక్ ఫ్రీ

రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ శాఖలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీముల ఏర్పాటు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా కేంద్రం భీమవరం పట్టణంలో నానాటికీ పెరుగుతున్న వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు ట్రాఫిక్ ఫ్రీగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా సమావేశమై భీమవరం పట్టణంలో ట్రాఫిక్ అవరోధాలు, రోడ్ల ఆక్రమణ, సక్రమ పార్కింగ్, భద్రత లేని డ్రైవింగ్ వంటి అంశాలపై రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, రవాణా శాఖల అధికారులు, ఆటో డ్రైవర్స్ యూనియన్, బులియన్ మార్కెట్, కళాశాలల యజమాన్యాలు, కిరాణా మర్చంట్స్, లయన్స్ క్లబ్, స్వచ్ఛంద సంస్థలతో సమీక్షించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తమ బాధ్యతలను విధిగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను కచ్చితంగా తొలగించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రోడ్డు మార్జిన్ వైట్‌లైన్ దాటి టూవీలర్స్, ఫోర్ వీలర్స్ ఎట్టి పరిస్థితుల్లో పార్కింగ్ చేయరాదని ఆదేశించారు. గీత దాటితే అపరాధ రుసుం విధిస్తారని స్పష్టం చేశారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ గట్టిగా పాటించాలని, ఎవర్ని దండించే ఉద్దేశం తమకు లేదని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, అదనపు ఎస్‌పి వి.భీమారావు, భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, జిల్లా రవాణా అధికారి కృష్ణారావు, ఆర్‌టిసి ఆర్ఎం ఎన్‌విఆర్.వరప్రసాద్, టౌన్ సిఐలు ఎం.నాగరాజు, జి.కాళీచరణ్, తహశీల్దార్ రావి రాంబాబు, మున్సిపల్ సహాయ కమిషనర్ ఎ.రాంబాబు, టౌన్ సర్వేయర్ ఎస్.రమాబాయి, టిపిఒ సిహెచ్.పార్థసారథి, ఎసిపి ఎం.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మోడల్ పేపర్ల పంపిణీ

కాళ్ల:చదువు శక్తి వంతమైందని, ప్రపంచాన్ని మార్చగలిగేది చదువు మాత్రమేనని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య అన్నారు. మాలవానితిప్ప హైస్కూల్లో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య సౌజన్యంతో యుటిఎఫ్ ముద్రించిన పదో తరగతి మోడల్ ప్రశ్నా పత్రాల పుస్తకాలను మంగళవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలా నరసింహారావు అధ్యక్షత వహించారు. పట్టాభిరామయ్య మాట్లాడుతూ విజ్ఞానాన్ని సముపార్జించడంతో పాటు సమాజంలోని స్థితిగతులను తోటి వారి సామాజిక ఆర్థిక పరిస్థితులను విద్యార్థి దశ నుండే అధ్యయనం చేయాలన్నారు. హెచ్‌ఎం నరసింహారావు మాట్లాడుతూ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 27 మంది విద్యార్థులకు ఈ సంవత్సరం కూడా ఈ మోడల్ ప్రశ్నా పత్రాల పుస్తకాలను అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు జి.రామకృష్ణంరాజు, సిహెచ్.కుమారబాబ్జీ, యుటిఎఫ్ మండల అసోసియేట్ అధ్యక్షులు డి.కనకదుర్గ, ఉపాధ్యాయులు ఎన్‌డివి.ప్రసాద్, పి.అప్పలస్వామి, శివలాల్ యాదవ్ పాల్గొన్నారు.

భీమవరం టౌన్:అనాకోడేరు డిఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు కె.రాజేష్ కుమార్ రాజు సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులు 60 మందికి యుటిఎఫ్ మోడల్ పేపర్స్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎన్ఎస్ఎస్ భగవాన్‌రాజు మాట్లాడుతూ ఈ మోడల్ పేపర్స్‌లోని అన్ని సబ్జెక్టులకు సంబంధించి చదవాలని సూచించారు. పాఠశాల ప్రథమ సహాయకులు రేపాక వెంకన్న బాబు, ఉపాధ్యాయులు బి.వనజ, ఎన్.శారద, కె.సాగరరాజు, ఎంవి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టాలి

గణపవరం:విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. మంగళవారం స్థానిక బాలికల హైస్కూల్లో రెడ్‌క్రాస్ మహిళా సాధికారత ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిర్మలకుమారి మాట్లాడుతూ ఆహారపు అలవాట్ల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. భోజనం ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం తోట అప్పారావు, కాలేజీ లెక్చరర్లు రాజబాబు, నెక్కంటి బాబు పాల్గొన్నారు. సమావేశంలో విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, చాక్లెట్లు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం నిర్మలకుమారిని సత్కరించారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

గణపవరం: మానవత ఆధ్వర్యంలో మంగళవారం విద్యాజ్యోతి మెరిట్ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. మానవత కెరియర్ గైడెన్స్ డైరెక్టర్ తాతపూడి మోహన్‌రావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ కర్ర వినాయక, అధ్యక్షులు గంటా అన్నవరం, బొద్దు శ్రీనివాస్‌రావు, వంకాయల రామారావు, విద్యాజ్యోతి సంస్థ అధినేత చేబోలు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పల్లెలు పరిశుభ్రంగా ఉండాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పల్లెల్లో పరిశుభ్ర వాతావరణం కనిపించాలని దీనికి పంచాయతీలు, గ్రామస్తులు కట్టుబడి పని చేసే స్వచ్ఛ పల్లెలు ఆవిష్కృతమవుతాయని ఎంపిడిఒ వి.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పెద్దతాడేపల్లిలో ఇంటింటా చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో ఇంటింటి చెత్త సేకరణ, చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. అనంతరం చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ పరిస్థితులు చేపట్టాల్సిన పనులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి టి.రవిచంద్ర, సచివాలయ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

తాడేపల్లిగూడెం:పట్టణ సుందరీకరణలో భాగంగా స్థానిక హౌసింగ్ బోర్డు సెంటర్‌లోని ఎన్‌ఆర్ సర్కిల్ వద్ద రోడ్డు పక్కన ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ సుందరీకరణలో భాగంగా స్థానిక ఎన్‌ఆర్ జంక్షన్, పోలీస్ ఐలాండ్ వద్ద [illegible] తొలగించి ఐలాండ్ తాడేపల్లిగూడెం బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ రెండు పోల్ల సిగ్నల్స్ కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో టిపిఒ జగదీష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా రామశాస్త్రి

ఆకివీడు:ప్రసిద్ధ క్షేత్రం భీమేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ప్రముఖ వాస్తు జ్యోతిష్య శాస్త్ర పండితుడు వేమూరి వెంకట సీతారామశాస్త్రి నియమితులయ్యారు. ఆయనతోపాటు మరో 8 మంది సభ్యులను, ఎక్స్ అఫిషియో సభ్యులుగా అర్చకుడిని నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు టిడిపి మండల మాజీ అధ్యక్షుడు మోటిపల్లి రామవరప్రసాద్ తెలిపారు. ట్రస్ట్ బోర్డు సభ్యులుగా చింత ఆదిశేషు, పి.రాంబాబు, చుండూరు వెంకటేశ్వరరావు, జె.మణికంఠ, కొండారెడ్డి, ఎం.శ్రీదేవి, ఎ.దుర్గాభవాని, ఎం.శ్రీశ్రీ, టి.చంద్రకుమారి, ఎక్స్ అఫిషియో సభ్యులుగా అర్చకులు ఎ.వెంకటరత్నం నియమితులయ్యారు. త్వరలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి

పెనుమంట్ర: అంగన్వాడీలకు చెందిన దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పెనుమంట్ర ఐసిడిఎస్ పరిధిలోని అంగన్వాడీ సెక్టార్ ప్రతినిధులు జి.విజయలక్ష్మి, వై.ఉషారాణి, కె.తులసి కోరారు. మంగళవారం స్థానిక ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద బిఎసిఎన్ అధికారి అంగర శ్రీకృష్ణకుమారి ద్వారా డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని నినదించారు. ఈ నెల 12న కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని తెలిపారు.

లాభాల బాటలో కాళ్లకూరు సొసైటీ

30 ఏళ్ల నుంచి నూరుశాతం బకాయిలు వసూలు



కాళ్లకూరు సొసైటీ భవనం

ప్రజాశక్తి - కాళ్ల

సహకార సంఘాలు చాలావరకు రుణ వితరణ, ఇతర సేవలకే పరిమితమవుతున్నాయి. మరికొన్ని సంఘాలు రైతుల అవసరాలు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వాణిజ్య సరళిలో తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తూ సంఘం, రైతుల అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. ఈ కోవకు చెందినదే కాళ్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం. రైతులకు సేవలందిస్తూ ఆదాయ మార్గాలవైపు దృష్టి సారిస్తోంది. చిన్న సంఘమైనా సేవల్లో ముందుంటూ రైతులు, ప్రజల మన్ననలు పొందుతోంది.

47 ఏళ్ల నుంచి 'ఎ' గ్రేడ్

కాళ్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం 47 ఏళ్ల నుంచి 'ఎ' గ్రేడ్ తరగతి సొసైటీగా పేరుగాంచి ప్రగతిపథంలో పయనిస్తోంది. కాళ్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అంచలంచెల ప్రగతి సాధిస్తోంది. ఏటేటా తన లాభాలను పెంచుకుంటూ సహకారం.. సేవల్లో జిల్లాలోని ఆదర్శంగా నిలుస్తోంది.

30 ఏళ్లుగా బకాయిలు నూరుశాతం వసూలు

30 ఏళ్లుగా సభ్యుల నుంచి రికవరీలో ప్రథమ స్థానం పొంది ఏటా అవార్డులు అందుకుంటోంది. మంచి దృక్పథంతో గ్రామీణ రైతులకు రుణాలందించే 1939లో పెన్మెత్స వెంకట సోమరాజు కాళ్లకూరు సహకార సంఘాన్ని ఏర్పాటు చేశారు. సొసైటీ మొదటి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 375 మంది సభ్యులతో ప్రారంభమైంది. 30 ఏళ్లపాటు ఏకధాటిగా ఏకగ్రీవంగా ఎన్నికై, సొసైటీ అభివృద్ధికి తోడ్పడ్డారు. సంఘం తొలినాళ్లలో కేవలం వేల రూపాయల్లో మాత్రమే లాభాలను ఆర్జించేది. సొసైటీ అధ్యక్షుల పర్యవేక్షణ, సిబ్బంది పనితీరు, సభ్యుల సహకారంతో డిపాజిట్లు గణనీయంగా పెరిగాయి. 2024-25వ సంవత్సరంలో రూ.19 కోట్ల 48 లక్షల 59 వేలు సంఘ సభ్యుల నుంచి వసూలు చేశారు. క్రాప్‌లోన్స్ రూ.కోటీ 65 లక్షల 30 వేల మధ్య వాయిదా అప్పులు రూ.4 లక్షల 14 వేలు, ఎస్ఎల్ఎఫ్ లోన్స్ రూ.41 లక్షల 43 వేలు మొత్తం రూ.20 కోట్ల 54 లక్షల 78 వేలు గత 30 సంవత్సరాలుగా నూటికి నూరుశాతం బకాయిలు వసూలు చేశారు. ప్రస్తుతం 2228 మంది సంఘం సభ్యులు ఉన్నారు. డిపాజిట్లు రూ.22 కోట్ల 42 లక్షలు, షేర్ క్యాపిటల్ రూ.98 లక్షల 42 వేల 888. డిసిసిబిలో ఇన్వెస్టుమెంట్స్ రూ.8 కోట్ల 86 లక్షల 61 వేల 983. సంఘ రిజర్వ్ నిధులు రూ.కోటీ 23 లక్షలు. డిసిసిబి రిజర్వ్ నిధులు రూ.11 కోట్ల 44 లక్షలు. డిసిసిబి బారోయింగ్స్ రెండు కోట్ల 12 లక్షల 68 వేల రూపాయలతో సంఘం లాభాల బాటలో పయనిస్తోంది.

వరి, ఆక్వా రంగం

ఈ ప్రాంతంలో వరి, ఆక్వా రంగం విస్తరించింది. రైతులు కష్టపడితత్వం ఉన్న వారు కావడంతో చేప, రొయ్యల సాగులో రాణిస్తున్నారు.

వార్షిక టర్నోవర్ రూ.43 కోట్లు

సహకార బ్యాంకులో రూ.43 కోట్ల వార్షిక టర్నోవర్ నడుస్తోంది. పంట రుణాలు, బంగారు ఆభరణాలు, చేపల మేత వివిధ రకాల రుణాలు మంజూరు చేస్తూ రైతులకు, ప్రజలకు చేయూతనిస్తూ రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకుంటూ సొసైటీని సభ్యులు ముందుకు నడిపిస్తున్నారు. కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల రైతులు, ప్రజలకు సేవలందిస్తోంది. రైతులకు రూ.20 కోట్ల 54 లక్షలు 78 వేల రుణాలు అందజేశారు. రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వడమే కాకుండా వారి కుటుంబ ఆర్థిక స్వావలంబనకు సహకార బ్యాంక్ ఎంతో ఉపయోగపడుతుంది.

నూరుశాతం బకాయిల వసూలు


ఇబ్బా శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి, కాళ్లకూరు



సంఘ పరిధిలో కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల్లో ఉన్న రైతులకు, ప్రజలకు, వరి రైతులకు పంట రుణాలు, ఆక్వా రైతులకు ఫిష్ ఫీడ్ రుణాలు, రైతు నేస్తం, బంగారు ఆభరణాలు బ్యాంకు ద్వారా అన్ని రకాల రుణాలు అందిస్తున్నారు. డిసిసిబి వారికి సొసైటీకి ప్రత్యేక శ్రద్ధతో సహకారం అందిస్తున్నారు. కాళ్లకూరు సొసైటీలో గత 30 సంవత్సరాలుగా నూటికి నూరు శాతం వసూలు చేస్తున్నాం. కాళ్లకూరు సొసైటీలో ఇచ్చిన రుణాలు నూరుశాతం వసూలుకు సహకరించిన సంఘ సభ్యులకు, డిసిసిబి వారికీ, సంఘ సిబ్బందికి, రైతులకు ప్రత్యేక కతజ్ఞతలు. ప్రతియేటా డిపాజిట్లు పెరిగాయి.

విస్తృత సేవలందిస్తున్నాం

దండు ప్రణవమూర్తిరాజు, కాళ్లకూరు సొసైటీ చైర్మన్



సొసైటీ ద్వారా రైతులకు, ప్రజలకు విస్తృత సేవలందిస్తున్నాం. సొసైటీ సిబ్బంది పనితీరు, సొసైటీ ప్రగతి బాగుంది.

ఆక్వా వ్యర్థాలు పంట కాలువల్లో వదిలితే చర్యలు

నీటి సంఘం ఉపాధ్యక్షులు విఘ్నేశ్వరరావు

ప్రజాశక్తి - ఉండి

ఆక్వా చెరువుల యజమానులు వ్యర్థ జలాలను పంట కాలువల్లోకి వదిలితే చర్యలు తప్పవని మహదేవపట్నం నీటి సంఘం ఉపాధ్యక్షులు కోట విఘ్నేశ్వరరావు అన్నారు. మంగళవారం మహదేవపట్నం ఛానల్ ప్రక్షాళన పనులను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు ఆదేశాల మేరకు పిసి ఛైర్మన్, మహదేవపట్నం నీటి సంఘం అధ్యక్షులు కునాధరాజు మురళీ కృష్ణరాజు సూచనలతో మహదేవపట్నం ఛానల్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు చెత్తాచెదారాన్ని ప్రొక్లైన్ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరరావు మాట్లాడుతూ ఆక్వా చెరువులోని వ్యర్థ జలాల వల్ల పంట కాలువలు విషపూరితమవుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన జలాలను ఇవ్వాలనే ఉద్దేశంతో రఘురామ కృష్ణరాజు పంట కాలువలను ప్రక్షాళన చేయించడమే కాకుండా ప్రతి గ్రామంలోనూ మైక్రో వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేయించారన్నారు. ప్రతి ఒక్కరూ తమకు సహకరించి ఆక్వా వ్యర్థాలను మురుగు కాలువలోకి విడిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ సిబ్బంది రమణ, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

గ్రామ,వార్డు సచివాలయ అధికారిగా కృష్ణవేణి

ఆచంట:వినియోగదారులకు ప్రభుత్వ పథకాల స్థితిని తనిఖీ చేయడానికి గ్రామ సచివాలయ వార్డు సెక్రటేరియట్ అధికారిగా కెఆర్.కృష్ణవేణి విధుల్లో చేరినట్లు ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం ఎంపిడిఒకు జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ 15 సచివాలయాల్లో సిటిజన్ ఇకెవైసి, స్కూల్ తనిఖీలు వంటివి నిత్యం మానిటరింగ్ చేస్తూ పురోగతి పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ పూర్ణ బాబ్జీ, ఇఒపిఆర్‌డి కె.బులిసూరన్న, మానిటరింగ్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన డిప్యూటీ ఎంపిడిఒగా వెంకటరెడ్డి

పెనుమంట్ర:పెనుమంట్ర మండలానికి నూతన డిప్యూటీ ఎంపిడిఒగా చింతా కుర్మ వెంకటరెడ్డి నియమితులయ్యారు. పోడూరు మండలం పండిత విల్లూరులో గ్రేడ్-1 సెక్రటరీగా పనిచేసిన వెంకటరెడ్డి ఉద్యోగోన్నతిపై మంగళవారం పెనుమంట్రలో విధుల్లో చేరారు. ఆయనకు ప్రజా ప్రతినిధులు, కార్యాలయం సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఇరగవరం డిప్యూటీ ఎంపిడిఒగా వెంకటనారాయణ

ఇరగవరం : ఇరగవరం మండల గ్రామ, వార్డు సచివాలయాల జిఎస్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపిడిఒగా వి.వెంకటనారాయణ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన పెనుమంట్ర మండలంలో పెనుమంట్ర గ్రామ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారని ఎంపిడిఒ శ్రీనివాసరావు తెలిపారు.

కొల్లేరు - చినమిల్లిపాడు రోడ్డుకు మోక్షం

రూ.3.40 కోట్ల నిధులు మంజూరు

ఆకివీడు: ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కొల్లేరు రోడ్డుకు ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు మంజూరు చేసింది. దీంతో ఆయా ప్రాంతవాసుల ఆశలు ఎట్టకేలకు నెరవేరనున్నాయి. రోడ్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసిందని టిడిపి సీనియర్ లీడర్ మండల మాజీ అధ్యక్షులు మోటిపల్లి రామవరప్రసాద్ తెలిపారు. చినమిల్లిపాడు నుండి మాలవానితిప్ప వరకూ సుమారు 16 కిలోమీటర్ల రోడ్డుకు మూడు కోట్ల నలభై లక్షల రూపాయలు మంజూరు అయిందని తెలిపారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

కల నెరవేరింది : సునీత

ప్రజాశక్తి - గణపవరం

తన చిన్నతనం నుంచి ఆరాధ్యదైవంగా భావించే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో గోపీనాథ్ పట్నంలో ఇరవై నిమిషాలు మాట్లాడడంతో తన కల నెరవేరిందని ఏలూరు జిల్లా తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల సునీత మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు చంద్రబాబు ఇచ్చిన సలహాలు 20 ఏళ్లకు పునాదులు వేసినట్లు అనిపించిందని తెలిపారు. ఆయనను కలిసి మాట్లాడడం తన జీవితంలో మరచిపోలేని రోజు అని తెలిపారు.

కనకరత్నమాలకు బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు

ప్రజాశక్తి - ఆచంట

సమాజానికి అందిస్తున్న వివిధ విశిష్ట సేవలను భీమలాపురం గ్రామానికి చెందిన ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు డాక్టర్ కొత్త కనక రత్నమాల వాకర్స్ క్లబ్ తరపున బెస్ట్ ప్రెసిడెంట్ బెస్ట్ క్లబ్ అవార్డు అందుకున్నారు. ఇటీవల భీమవరం కాస్మోటిక్ క్లబ్‌లో జరిగిన వాకర్స్ జిల్లా 201 కాన్ఫరెన్స్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎంప్రభావతి, డిస్టిక్ గవర్నర్ గుంటూరు రామరాజు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు రత్నమాల మంగళవారం విలేకరులకు తెలిపారు. రత్నమాలకు ఈ అవార్డు రావడం పట్ల సర్పంచి గుబ్బల మాధవరావు, వాకర్స్ క్లబ్ నాయకులు, మహిళా మండలి నాయకులు, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

గ్రంథాలయ అభివృద్ధికి శ్రీనివాసరావు కృషి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రంథాలయ అభివృద్ధికి శ్రీనివాసరావు ఎంతగానో కృషి చేశారని పలువురు వక్తలు అభినందించారు. మంగళవారం స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వి.శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సందర్భంగా అసోసియేషన్ సత్కార సభ నిర్వహించారు. గరికపాటి బాపయ్య శర్మ ఈ సేభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయాల కార్యదర్శి శేఖర్ బాబు, కృష్ణాజిల్లా గ్రంథాలయాల కార్యదర్శి రవికుమార్ విచ్చేశారు. శ్రీనివాసరావు 40 సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని వక్తలు కొనియాడారు. అనంతరం శ్రీనివాసరావు దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నన్ను ఎంతగానో అభిమానించి, నేడు సత్కారం చేసిన బుక్ రీడర్సుకు, పట్టణ ప్రముఖులకు, తోటి గ్రంథాలయ శాఖ అధికారులకు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత గ్రంథాలయాధికారి సాయిబాబా, పెంటపాడు గ్రంథాలయాధికారి, ప్రత్తి వీరాస్వామి, జనార్ధన్‌రావు కెవి.ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తారకాపురి లయన్స్ సేవలు అభినందనీయం

ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు:తారకాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం తణుకు ఇంపల్స్ జూనియర్ కళాశాల ఆవరణలో తారకాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడారు. కేవలం వైద్య సేవలు కాకుండా మహిళా సాధికారతపై ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సేవలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాయని తెలిపారు. యువతతో పాటు మహిళలకు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి ఎన్నో సేవలు అందిస్తూ విపత్కర పరిస్థితిలోనూ ప్రజలకు అండగా ఉంటూ లయన్స్ క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తోందన్నారు. తణుకులో కొనసాగుతున్న 8 లయన్స్ క్లబ్‌ల ద్వారా ఎంతో మంది దాతలు ముందుకొచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న సేవా కార్యక్రమాలతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు లయన్స్ క్లబ్ ద్వారా చేస్తున్న కార్యక్రమాలు మరింత విశ్రమం చేసి పేద ప్రజలకు అండగా నిలబడాలని కోరారు. ఈనెల 7న తణుకులో నిర్వహిస్తున్న 2కె, 5కె,10కె మారథన్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తారకాపురి లయన్స్ క్లబ్ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

డ్వాక్రా కార్యక్రమాలు పారదర్శంగా ఉండాలి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వం మహిళల జీవన ప్రమాణాలను పెంచేందుకు అమలు చేస్తున్న డ్వాక్రా స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలు పారదర్శకంగా ఉండాలని సెర్ప్ సిఇఒ వాకాటి కరుణ అన్నారు. నరసాపురం మండల సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, బ్యాంకర్లు, వెలుగు అధికారులు, సిబ్బందికి మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న 'మన డబ్బులు మన లెక్కలు' కార్యక్రమంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలకు సంబంధించి లెక్కలు రాయడం, నమోదు చేయడంలో జవాబు దారీతనం, పారదర్శకత కోసం మన డబ్బులు-మన లెక్కలు కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. స్త్రీనిధి ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలు తీసుకుని ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ అన్నవరపు నాగేంద్ర ప్రసాద్, డిఆర్‌డిఒ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిసిఎంలు కొండేటి శ్రీనివాస్, మోకా శ్రీనివాస్, ప్రసాద్, బాలాజీ, కుసుమ కుమారి, శ్రీనిధి ఎజిఎం రమణమ్మ, బ్యాంకుల కంట్రోలర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం 216 జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మొగల్తూరు మండలం కాళీపట్నం పడమర పల్లిపాలేనికి చెందిన రమాని గోపాలకృష్ణ (55) నరసాపురం ఫైనాన్స్ షాప్‌నకు వెళ్తున్నాడు. నరసాపురం మిస్సమ్మ హాస్పటల్ సమీపంలో టీ తాగేందుకు రోడ్డు దాటుతున్న గోపాలకృష్ణను వేగంగా బైక్ ఢీకొంది. తలకు గాయమైంది. అటుగా వెళ్తున్న నరసాపురం రూరల్ ఎస్ఐ టి.వెంకట సురేష్ క్షతగాత్రుడిని వైద్యం నిమిత్తం జీపులో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు గోపాలకృష్ణ మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై గోపాల కృష్ణ కుమారుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్ఐ సిహెచ్ జయలక్ష్మి కేసు నమోదు చేశారు.

కత్తులతో బెదిరిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కత్తులతో రోడ్లపై తిరుగుతూ అటుగా వస్తున్న వారిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు మంగళవారం వన్ టౌన్ సిఐ నాగరాజు తెలిపారు. వివరాలను సిఐ వెల్లడించారు. గత నెల 26వ తేదీ సాయంత్రం సుమారు 5 గంటలకు భీమవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని, భీమవరం పట్టణం, చిన్నరంగనిపాలెం సెంటర్లో ఉన్న శ్రీ రాఘవేంద్ర బెంగళూరు అయ్యంగార్ బేకరీ ఎదురుగా రోడ్డుపై కొందరు విద్యార్థులు బస్సు ఎక్కడానికి నిలబడ్డారు. అదే సమయంలో అక్కడికి రెండు మోటార్ సైకిళ్లపై నలుగురు వ్యక్తులు వచ్చారు. వచ్చిన నలుగురిలో ఇద్దరు కత్తులతో విద్యార్థులను బెదిరించి దౌర్జన్యంగా వాళ్ల వద్ద ఉన్న డబ్బులు ఇవ్వాలని లేదంటే చంపేస్తామని బెదిరించగా ఆ విద్యార్థులు ప్రాణ భయంతో అక్కడ నుండి పారిపోయారు. తరువాత వారు పక్కనే ఉన్న శ్రీ రాఘవేంద్ర బెంగుళూర్ అయ్యంగార్ బేకరీ చుట్టు పక్కల కత్తులతో స్వైర విహారం చేస్తూ స్థానికులకు, విద్యార్థులకు కత్తులు చూపి భయభ్రాంతులకు గురిచేశారు. వారు భీమవరం పట్టణం చినరంగనిపాలెం పుంత ఏరియాకు చెందిన కోలా ఆనంద్, కోలా ప్రకాష్‌గా గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి మంగళవారం కోర్టులో హాజరు పర్చగా కోర్ట్ వారికి 14 రోజులు రిమాండ్ విధించింది. మిగిలిన ఇద్దరిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. భీమవరం వన్ టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం టౌన్ హాల్ హోటల్ రూమ్‌లో అడపా శివ (42) ఉరివేసుకుని మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. భీమవరం నాచువారి సెంటర్‌కు చెందిన శివ గత కొంతకాలంగా రొయ్యల వ్యాపారం చేస్తూ గొల్లలకోడేరులోని సంజన అపార్టుమెంట్‌లో కుటుంబంతో కలిసి అద్దెకుంటున్నాడు. అయితే ఈ నెల 1వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో శివ టౌన్ హాల్ హోటల్ 106 రూమ్‌ను అద్దెకు తీసుకున్నాడు. 2వ తేదీ మధ్యాహ్నం వరకూ శివ రూమ్ నుండి బయటకు రాకపోవడంతో హోటల్ రిసెప్షనిస్ట్ బలవంతంగా పోలీసుల సహకారంతో రూమ్ తాళాన్ని బద్దలు కొట్టి తెరవగా శివ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్నాడు. శివ గత రొయ్యల వ్యాపారంలో తలెత్తిన ఆర్థిక లావాదేవీలు, పేకాటలో భారీగా నగదు పోగొట్టుకోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇదే రూమ్‌లో అర్ధరాత్రి వరకు మరో వ్యక్తి ఉన్నట్లు సమాచారం. శివకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పదమృతి

ప్రజాశక్తి - పాలకోడేరు

మైగ్రేన్ తలనొప్పి భరించలేని స్థితిలో నీరు అనుకుని పొరబాటున పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే మోగల్లు గ్రామానికి చెందిన ఆదిరెడ్డి దుర్గారావు (43) 14 ఏళ్లుగా భీమవరం ఆర్‌టిసి డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తరచూ మైగ్రేన్ తలనొప్పితో బాధపడుతున్న దుర్గారావు గత నెల 30 వ తేదీ రాత్రి తీవ్రం తలనొప్పి రాగా చీకటిలో మంచినీళ్ల బాటిల్ అనుకుని పురుగుల మందు బాటిల్ మూత తీసుకుని తాగాడు.కడుపునొప్పి ఎక్కువై కేకలు వేయగా భార్య రాధ వెంటనే భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 1 వ తేదీన మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాల నుంచి సమాచారం అందినట్లు, అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు పోలీసులు వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వీరవాసరం :ఈనెల మూడో తేదీన కొణితివాడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎఇ అప్పారావు మంగళవారం తెలిపారు. భీమవరం నుంచి కొత్తలైన్ వేయడం నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకూ వీరవాసరం మండలంలో కొణితివాడ సబ్‌స్టేషన్ పరిధిలో కొణితివాడ, మడుగు పోలవరం, అండలూరు, పొలమూరు, పంజా వేమవరం, ఇండస్ట్రియల్ ఫీడర్లకు అలాగే నవుడూరు, కొణితివాడ, అండలూరు, నేల పోగుల గవరపాలెం, ఉత్తరపాలెం తదితర గ్రామాల గృహాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

దొడ్డనపూడిలో రసాభాసగా గ్రామసభ

కాళ్ల:దొడ్డనపూడిలో పంట కాలువ, బోదెల ప్రక్షాళన కోసం రైతులు, గ్రామస్తులతో మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామసభ రసాభాసగా మారింది. పంటకాలువలోకి ఆక్వా చెరువుల నీరు వదిలేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లల్లోని మురుగునీరు వదలడంతో పంట బోదె కలుషితమైపోతోందని కొంతమంది గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసిన సమయంలో వివాదం తలెత్తి సభ రసాభాసగా మారడంతో సభను వాయిదా వేశారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

తాడేపల్లిగూడెం:ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా డిసెంబరు 1 నుంచి 14వ తేదీ వరకూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం పథకాల అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ వేసిన పోస్టర్లు మంగళవారం శేష్ మహల్ సెంటర్లో భవన నిర్మాణ కార్మికులతో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాన వరప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 నెలలకు అవుతున్నా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఒక్క హామీ కూడా నేటికీ అమలు చేయలేదని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ 1 నుండి 14 వరకూ జిల్లాలలో కింద స్థాయి వరకూ ప్రతి అడ్డాల్లో కరపత్రాలతో విస్తత ప్రచారం, క్యాంపెయిన్ చేపట్టాలని, 15న జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ప్రదర్శన, ధర్నాలు చేయాలని పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ నెల 15న జిల్లా కలెక్టర్ వద్ద జరిగే ధర్నాను భవన నిర్మాణ కార్మికులు అత్యధికంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విచ్చలవిడిగా బెల్టు షాపులు

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలిలో టిడిపి నాయకులు కనుసన్నల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని కొడమంచిలి సర్పంచి సుంకర సీతారాం విమర్శించారు. గ్రామంలోని టిడిపి నాయకుల బంధుమిత్రుల సంబంధించిన సోడా షాపుల్లో మద్యం ఎరులై పారుతోందన్నారు. బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదన్నారు. గ్రామాల్లోని నిరుపేద కుటుంబాల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎక్సైజ్ పోలీస్‌లు స్పందించకపోతే నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

రగ్బీలో జాతీయస్థాయి పోటీలకు డానియేల్ ఎంపిక

మొగల్తూరు :తమ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఇందిర అన్నారు. కెపి.పాలెంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల నెల్లూరు జిల్లాలో జరిగిన ఎస్‌జిఎఫ్ అండర్ - 17 బాయ్స్ రగ్బీ విభాగంలో జి.దానియేలు, బి.నాగేంద్ర జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనబర్చారు. దీనిలో భాగంగా జి.దానియేలు జాతీయస్థాయి రగ్బీ క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెలలో భువనేశ్వర్‌లో జరిగే అండర్-17 పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతి నిధ్యం వహిస్తాడు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జి.జయకుమార్‌ను, ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం పి.ఇందిర, ఉపాధ్యాయులు అభినందించారు.

వృద్ధులకు బిపి, షుగర్ పరీక్షలు

పాలకొల్లు:నర్సాపురం యునైటెడ్ కాపు వనితా క్లబ్ ఆధ్వర్యంలో పాలకొల్లులోని రాహుల్ సామాజిక సేవా సంస్థ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు విజయ డయాగ్నస్టిక్స్ సెంటర్ వారు ఉచితంగా షుగర్, బిపి పరీక్షలు మంగళవారం నిర్వహించారు. వారికి స్నాక్స్, పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎంతో ఆదరంగా వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులు జోగాడ ఉమామహేశ్వరరావును అభినందించారు.

కొనసాగిన స్కూల్ బస్సుల తనిఖీ

తాడేపల్లిగూడెం:బస్సుల ఫిట్నెస్ సరిగా లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డిఎస్.నాయక్ హెచ్చరించారు. మంగళవారం వరుసగా నాలుగో రోజు బస్సులు తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా శశి ఇంజినీరింగ్ కళాశాలకు సంబంధించిన 60 బస్సులు పరీక్షించగా వాటిలో 16 బస్సులకు లోపాలున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఈ బస్సుల్లో గ్యాస్ సిలిండర్లు, ఎమర్జెన్సీ డోర్ సరిగా పనిచేయకపోవడం, వాహనాల్లో మెడికల్ కిడ్స్ లేకపోవడంతో బస్సులు యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా సరిచేసుకోవాలని లేకుంటే వాహనాలు సీజ్ చేస్తామని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

నరసాపురం:స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-2 ఆధ్వర్యంలో సీతారాంపురం సౌత్‌లో చేపట్టిన సేవా శిబిరం మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. 6, 7, 8 తరగతి విద్యార్థులకు క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. మహిళల హక్కులపై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కోశాధికారి కెవి.స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ ఎస్.సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎ.గోపీచంద్ పాల్గొన్నారు.